RNI:TS-28-0030298

తెలంగాణ డైలీ న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 284 శుక్రవారం, నవంబర్ 06, 2026 , పేజీలు - 06 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలి

: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు 5: గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని దిశానిర్దేశం చేశారు. ఈరోజు (గురువారం) తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రుల, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే అతిథులు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న వెంటనే ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాసుల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ముందే పూర్తి సమాచారాన్ని ప్రతినిధులకు అందజేయాలని సీఎం సూచించారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారి, సెక్యూరిటీ అధికారిని నియమించాలని మార్గనిర్దేశం చేశారు. టూరిజానికి మరింత సమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో ఉన్న ప్రముఖ టూరిస్ట్ స్పాట్‌లను గ్లోబల్ సమ్మిట్‌లో ప్రదర్శించాలని నిర్దేశించారు. వాతావరణ మార్పులపైన గ్లోబల్ సమ్మిట్‌లో చూడాలని దిశానిర్దేశం చేశారు.

కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు

తెలంగాణ కేబినెట్



హైదరాబాద్, నవంబరు 5 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈరోజు (గురువారం) రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రి మండలి కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులోగా రెండు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిశ్చయించింది.కాళేశ్వరం ప్రాజెక్టుపై మూడేళ్లుగా చేస్తున్న మరమ్మతుల గురించి అసెంబ్లీలో వివరించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులోగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కాళేశ్వరం పరివాహక జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు గోదావరిని సందర్శించాలని మార్గనిర్దేశం చేశారు. గోదావరి నుంచి నీటి ప్రవాహం, ఎత్తిపోతల ప్రక్రియలను క్షేత్రస్థాయిలో వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి వద్దే మీడియాకు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తరలించారనే ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

ఆ పథకాల ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్



హైదరాబాద్, నవంబరు 5 : నవంబరు19వ తేదీన సిద్దిపేటలో ఇందిరమ్మ జీవిత భీమా, ఇందిరమ్మ చీరల పంపిణీ పథకాలను ప్రారంభిస్తామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. సిద్దిపేట వేదికగా ఈ రెండు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టునున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూముల కేటాయింపుపై మంత్రి మండలి స్పష్టమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈరోజు (గురువారం) జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు.ఎన్‌డీఎస్‌ఏ సూచించిన అన్ని రకాల పరీక్షలను పూర్తిచేశాం..కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎన్‌డీఎస్‌ఏ అధికారులు సూచించిన అన్ని రకాల పరీక్షలను పూర్తిచేశామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రతి పరీక్షను విడివిడిగా నిర్వహించి నివేదికలను ఎన్‌డీఎస్‌ఏకు సమర్పించామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు తాము సిద్ధమ య్యామని పేర్కొన్నారు. నిపుణుల కమిటీ సూచనల మేరకు బ్యారే జీల పునరుద్ధరణ విధానాలను ఖరారు చేశామని వెల్లడించారు. బ్యారేజీలను ఏ విధంగా మరమ్మతు చేయాలనే అంశంపై స్పష్టమైన నివేదికలు వచ్చాయని చెప్పుకొచ్చారు. అప్‌స్ట్రీమ్‌లో గట్టు నిర్మాణాలు ఎలా చేపట్టాలనే విషయంపై తమకు సూచనలు అందాయని అన్నారు.బ్యారేజీల భద్రతకు అత్యంత ప్రాధా న్యం..డౌన్‌స్ట్రీమ్‌లో స్పిల్‌వే అప్రాన్ నిర్మాణంపై నిపుణులు నిర్దిష్ట సూచనలు చేశారని మంత్రి పొంగులేటి చెప్పారు. స్పిల్‌వే అప్రాన్ ఎంత వెడల్పు, ఎంత మందంతో నిర్మించాలనే అంశాలపై నివేదికలు సిద్ధమయ్యాయని తెలిపారు. సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా బ్యారేజీల మరమ్మతులు చేపడతామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురా వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. మూడు బ్యారేజీ లను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బ్యారేజీల భద్రతకు అత్యంత ప్రాధా న్యం ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి

రేవంత్ ప్రభుత్వానికి కవిత డెడ్‌లైన్



హైదరాబాద్, నవంబర్ 05: ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అందుకోసం రేవంత్ ప్రభు త్వానికి నెల రోజులు సమయం ఇస్తున్నామన్నారు. అయ్యప్ప సొసైటీలో ఇల్లు కొని ఎవరూ నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ సొసైటీలో 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని వివరించారు.గురువారం హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. అయ్యప్ప సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సొసైటీలోనే నారాయణ, చైతన్య విద్యా సంస్థలు ఉన్నాయని గుర్తు చేశారు. సర్వే నెంబర్ 11/18 నుంచి 11/44 వరకు అక్రమ నిర్మాణాలు జరిగాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు.హైదరాబాద్ భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప ముఖ్యమంత్రిలేదని వ్యంగ్యంగా అన్నారు.

తెలంగాణను అంతర్జాతీయ

స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

: మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్, నవంబరు 5 : తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధా న్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) గచ్చిబౌలిలో తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ -- 2026 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిం చారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో అంతర్జాతీయ పోటీలు కొనసాగుతున్నాయి. నవంబరు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.ఈ పోటీల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని, ప్రసంగించారు. క్రీడారంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా తాము చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటే క్రీడాకారులకు తమ ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను పెంచే క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహం కల్పిస్తామని స్పష్టం చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

చర్చ వీధుల్లో కాదు పార్లమెంట్‌లో పెట్టాలి..

రాహుల్‌గాంధీకి అమిత్ షా కౌంటర్

న్యూఢిల్లీ:ప్రధాని నరేంద్రమోదీబహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న డిమాండ్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షాతప్పుపట్టారు. రాజకీయ చర్చను వీధుల్లో పెట్టకూ డదని, పార్లమెంట్ పెట్టాలని ఆయన కౌంటర్ వేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలను రాహుల్‌గాంధీ తట్టుకోలేరని ఎద్దేవాచేశారు.బాధ్యతాయుతమైన చర్చ జరగాలని మీరు అనుకుంటే, మీ ఆందోళనల్లో సత్యం, తర్కం ఉంటే రండి పార్లమెంట్‌లో చర్చించుకుందాం అని సవాల్ చేశారు. ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకుందాంగానీ మా సమాధా నాలను మీరు తట్టుకోలేరని రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. ఎప్పటిలాగే ఇప్పుడు కూడా పారిపోతారని ఎద్దేవాచేశారు. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని విమర్శించారు.బాయ్‌కాట్‌లను రాజకీయ వ్యూహంగా మార్చుకుందని విమర్శించారు. పార్లమె ంట్‌లో కీలకమైన చర్చలను తప్పించుకుంటున్నారని, గందర్‌గో ళం సృష్టించేందుకు వీధుల్లో జనాలను సమీకరి



ంచుకుంటున్నారని హర్యానాలో జరిగిన ఓ సభలో అమిత్ షా మండిపడ్డారు.

ట్రంప్ ఓటమి నుంచి బీజేపీ

నేర్చుకోవాల్సిన పాఠం..!



అమెరికా:అమెరికాలో తాజాగా జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయాలు చవిచూస్తోంది. సాధారణంగా అయితే భారత్ లో దీనిపై ఎలాంటి చర్చా ఉండేది కాదు. కానీ రిపబ్లికన్ పార్టీ వ్యవహా రశైలిని భారత్ లో అధికార బీజేపీతో పోలుస్తూ పలు విశ్లేషణలు జరుగుతున్నాయి. బీజేపీ అనుసరిస్తున్న విద్వేష రాజకీయాలతో పాటు నియోజకవర్గాల పునర్విభజన, జనగణన విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో అసలు అమెరికాలో ఏం జరిగిందో , దాన్నుంచి బీజేపీ నేర్చుకోవాల్సిన పాఠాలు ఏంటో 'ద హిందూ' ప్రత్యేకంగా విశ్లేషించింది. దీని ఆధారంగా వన్ ఇండియా కథనం చూద్దాం .బీజేపీ డీలిమిటేషన్, జనగణన- అమెరికా మార్పులుబీజేపీ 021లో జరగాల్సిన జనగణను వివిధ సాకులు చూపుతూ 2026కు వాయిదా వేసింది. అలాగే సాధారణ షెడ్యూల్‌కు భిన్నంగా జనగణన నిర్వహించి, ఆ తర్వాత దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ప్రణాళికలు రచించింది. బీజేపీ రాజకీయ పక్షపాతంతో ఈ ప్రక్రియను హడావిడిగా, రహస్యంగా చేపట్టడంపై విపక్షాలు ఇప్పటికే విమర్శలు గుప్పిస్తున్నాయి.

వైఎస్ జగన్ కుటుంబ వివాహ వేడుకకు

తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్, కేటీఆర్, గౌతమ్ అదానీ

అమరావతి:మాజీ సీఎం వైఎస్ జగన్ బంధువు వివాహ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి, వ్యాపారవేత్త గౌతమ్ అదానీ సహా రాజకీయ, వ్యాపార ప్రముఖులు హాజరయ్యారు. చెన్నైలోని లీలా ప్యాలెస్‌లో జగన్ బాబాయి కుమారుడు వైఎస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహం వేడుక శుక్రవారం జరిగింది. ఈ వేడుకలో సీఎం విజయ్, వైఎస్ జగన్, కేటీఆర్‌లు కలిసి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇక, నటి త్రిష కూడా విజయ్ వెంట రావడం గమనార్హం.చెన్నైలో జరిగిన వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జగన్ బాబాయి కుమారుడు వైఎస్ అనిల్ కుమార్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహ వేడుక చెన్నైలోని లీలాప్యాలెస్‌లో శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు రావాలని సీఎం విజయ్‌ను కలిసి అనిల్ కుమార్ ఆహ్వానించారు. దీంతో విజయ్, ఆయన తల్లి శోభ



చంద్రశేఖర్‌తో పాటు నటి త్రిష కూడా హాజరయ్యారు. నూతన వధూవరులు శ్రేయ- ఉజ్వల్‌లను ఆశీర్వదించారు.
మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతి, కేటీఆర్, ఆయన సతీమణి శైలిమ, వైఎస్ విజయమ్మ సైతం ఈ వేడుకకు హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం విజయ్‌ను వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు. అటు ఇటు తమిళనాడు సీఎం, గౌతమ్ అదానీ, మధ్యలో వైఎస్ జగన్ కూర్చున్న ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అలాగే, వైఎస్ విజయమ్మ తన కుమారుడ్ని ఆప్యాయంగా ముద్దుపెట్టుకున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.మీరు మెచ్చే కథనాలు
"ఈ రెండేళ్లలో నన్ను ఏమైనా చేయండి.. కానీ నాకు టైం వచ్చినప్పుడు మాత్రం'.. టీడీపీ నేతలకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వార్నింగ్‌హిందూపురం వ్యాపారి అకౌంట్‌లో రూ.వెయ్యి కోట్లు జమ.. అరగంటలోనే ఊహించని ట్విస్ట్, పోలీస్ స్టేషన్‌కు పరుగులూఖ47: బాక్సాఫీస్ వద్ద వెంకీ-త్రివిక్రమ్ కాంబో బోల్తా... 'ఆదర్శ కుటుంబం' మూవీకి రూ. 40 కోట్ల నష్టం?
విజయవాడలో ఓటమిపై స్పందించిన ఏబీ వెంకటేశ్వరరావు.. ఆ పనిమాత్రం చేసి తీరతానని వాగ్దానంతమిళనాడు సీఎం విజయ్, జగన్ మోహన్ రెడ్డి, కేటీఆర్ ఒకే సమయంలో లీలా ప్యాలెస్‌కు చేరుకోగా.. వేదికపై ముగ్గురు కలిసి వధూవరులను ఆశీర్వదించడం రాజకీయ, ఆసక్తికరంగా మారింది.

చదువుతోనే బంగారు భవిష్యత్తు.

- సర్పంచ్ పోనేమోని మాణిక్యం...
- పది విద్యార్థుల కోసం స్పెషల్ క్లాసులు.. హెచ్ఎం



పరిగి, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్టకొడూరు ఉన్నత పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుద్ధదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోనేమోని మాణిక్యం, ఏఏపీసీ చైర్‌పర్సన్ అనితారాణి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ?ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోనేమోని మాణిక్యం మాట్లాడుతూ... విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగవ్వాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా విద్యార్థుల్లో సృజనా త్మకత, చిత్రలేఖనం, క్రీడలు వంటి వివిధ అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గ్రామస్తులందరి సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసానిచ్చారు. ?ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుద్ధదేవ్ మాట్లాడుతూ... పాఠశాల బలోపేతానికి సమాజం, తల్లిదండ్రులు, యువత తమ వంతు ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ చదువుపై పూర్తి దృష్టి పెట్టేలా తల్లిదండ్రులు నిరంతరం ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ, అనవసర విషయాలపై ధ్యాస పెట్టకుండా మంచి నడవడికను అలవర్చుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ?అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు లక్నాపూర్ శ్రీనివాస్, చంద్రశేఖర్, మధుసూదన్, షేక్ సాదిక్, కవిత, కరుణాకర్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వముఖ ప్రగతికి అందరం కలిసికట్టుగా శ్రమిస్తామని తెలిపారు. అనంతరం? పాఠశాలలో విద్యార్థులు సాధించిన ప్రగతికి సంబంధించిన నివేదిక పత్రాలను (మార్క్ షీట్లు) సర్పంచ్ పోనేమోని మాణిక్యం, ఏఏపీసీ చైర్‌పర్సన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా వినియోగంపై అవగాహన సదస్సు..



పరిగి, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణ మరియు బాణాసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిగి అగ్నిమాపక శాఖ అధికారి ఎన్. సేవ్యా నాయక్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆయన దీపావళి పండుగ విశిష్టతను వివరిస్తూ, చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. వాహనాలు, విద్యుత్ పరికరాలు మరియు ఇరుకైన ప్రదేశాలకు దూరంగా మైదానాల్లో మాత్రమే టపాకాయలు కాల్చాలని సూచించారు. పిల్లల చేత పెద్ద బాణాసంచా లేదా ప్రమాదకరమైన టపాకాయలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్పించకూడ దన్నారు. ?బాణాసంచా పేల్చేటప్పుడు కళ్లకు రక్షణగా అద్దాలు, చేతులకు రక్షణ కవచాలు, మరియు తప్పనిసరిగా కాళ్లకు పాదరక్షలు ధరించాలని చెప్పారు. అలాగే బాణాసంచాపై గాజు పాత్రలు లేదా ఇతర డబ్బాలను ఉంచి పేల్చడం తీవ్ర ప్రమాదకరమని హెచ్చరించారు. ఒకవేళ అకస్మాత్తుగా దుస్తులకు నిప్పు అంటుకుంటే కంగారుపడి పరుగెత్తకుండా.. ఆగి, నేలపై పడుకొని, దొర్లడం ద్వారా మంటలను వెంటనే ఆర్పేయవచ్చని వివరించా రు. ?పాఠశాలలో నేర్చుకున్న ఈ భద్రతా నియమాలను విద్యార్థులు తమ ఇరుగుపొరుగు వారికి కూడా తెలియజేయాలని, ఎలాంటి ప్రమాదాలు లేకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి ఎన్. సేవ్యా నాయక్, పాఠశాల ఇన్‌చార్జి పి. భాగ్యలక్ష్మి, అగ్నిమాపక సిబ్బందితో పాటు పాఠశాల ఆచార్యులు, మాతాజీలు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతోనైనా సమస్యలు తీరేనా?

- దౌల్తాబాద్ మండలానికి నిధుల కరువు..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మహిపాల్ ముదిరాజ్ తీవ్ర ధ్వజం





దౌల్తాబాద్, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
సరైన నిధులు లేక అభివృద్ధికి నోచుకోని వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం స్వయంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే పాలన తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ ముదిరాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ?ఈ సందర్భంగా మహిపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలు కేవలం ప్రచారానికే పరిమితమవుతున్నా యని, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలు తీరడం లేదని ధ్వజమెత్తారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మందులు అందుబాటు లో లేకపోవడం శోచనీయమన్నారు. గర్భిణీలకు అవసరమైన ఐరన్ ఇంజెక్షన్లు కూడా లేక పేద ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. కేవలం పర్యటనలతో సరిపెట్టకుండా ఆసుపత్రి సామర్థ్యాన్ని పెంచి, అవసరమైన వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచి 24/7 అత్యవసర వైద్య సేవలు అందించేలా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.అలాగే, ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని కేవలం వైద్య సేవల అవసరాలకే వినియోగించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని, దానికి వేరే స్థలాన్ని ఎంపిక చేయాలని కోరారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కమిషన్ల కక్కుర్తి కోసమే ఆసుపత్రి స్థలంలో భవనాన్ని కట్టేందుకు కుట్రలు చేస్తున్నారని, ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా దౌల్తాబాద్ మండల సమస్యలపై దృష్టి సారించి ఆసుపత్రికి నిధులు మంజూరు చేయాలని, గ్రామపంచాయతీ భవన స్థలాన్ని మార్చాలని అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ప్రజల ఆరోగ్య హక్కులు, మండల అభివృద్ధి కోసం దౌల్తాబాద్‌లో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు, ఎంపీటీసీలు కేశవ్ రెడ్డి, కృష్ణ, మాజీ జడ్పీటీసీ పాకిరప్ప, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తోక ఆశప్ప, సర్పంచ్‌లు సాయప్ప, వెంకటయ్య, నర్సప్ప, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శిరీష, రమేష్, అధికార ప్రతినిధి సంతోష్ కుమార్, నరసింహులు, పాండు నాయక్, నరసప్ప, కిషన్ నాయక్, శోభన్ నాయక్, మైపాల్, శ్రీనివాస్, రామ్ రెడ్డి, సోమయ్య మరియు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాస్ పల్లిలో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

- గ్రామాభివృద్ధే మా ప్రధాన ధ్యేయం: సర్పంచ్ గీతా ఆనంద్



కొందుర్గు, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
కొందుర్గు మండలం ఉత్తరాస్ పల్లి గ్రామంలో అభివృద్ధి దిశగా మరో అడుగు పడింది. గ్రామపంచాయతీ నిధులతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ మురుగునీటి కాలువ (అండర్ డ్రైనేజీ) పనులకు నేడు సర్పంచ్ శ్రీమతి గీతా ఆనంద్ గారు భూమిపూజ చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గీతా ఆనంద్ మాట్లాడుతూ... “గ్రామ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం. ప్రజల సంక్షేమం, గ్రామ పరిశుభ్రతను మెరుగు పరచడం కోసం మేము ఎల్లవేళలా ముందుండి పనిచేస్తాం. ఈ మురుగునీటి కాలువ నిర్మాణంతో గ్రామంలో పారిశుద్ధ్యం పెరిగి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుంది” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మమతా రెడ్డి, మాజీ సర్పంచ్ జహీరబీ ఖలీల్, ఉప సర్పంచ్ హలీం, సీనియర్ నాయకులు సాయన్న, జిల్లెల్ల నరసింహులు, పెంటయ్య, మాజీద్, జంగయ్య, హబీబ్, శ్రీకాంత్, రాజు, నయీమ్, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి...

- ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ యేసు మాదిగ

?పూడూరు, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) : వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మేడిపల్లి కలాన్ గ్రామంలోని ఎస్సీ కాలనీలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ యేసు మాదిగ కోరారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ రాకేష్‌లను కలిసి కాలనీ సమస్యలపై వినతిపత్రం అందించారు. ?ఈ సందర్భంగా యేసు మాదిగ మాట్లాడుతూ... ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ (మోరీలు) వ్యవస్థ సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని తెలిపారు. అలాగే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కాలనీలో పాడుబడిన మంచినీటి బావితో పాటు పనిచేయని చేతి పంపులు (బోరింగులు) వెంటనే రిపేరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ?దీనిపై పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ రాకేష్ స్పందిస్తూ... కాలనీలోని సమస్యలను సర్పంచ్ పల్లవి రాజు దృష్టికి తీసుకువెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందు కు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కాలనీవాసులు సైదుపల్లి రవికుమార్, శిదులూరు శశిధర్, దోసాడు పెంటమ్మ పాల్గొన్నారు.

దీపావళి వేళ రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్..



న్యూఢిల్లీ, నవంబర్ 5: దీపావళి పండుగ వేళ రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. పన్నుల పంపిణీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలకు నవంబర్ నెలకు సంబంధించిన పన్నుల వాటా కింద రూ.1,09,019 కోట్లను విడుదల చేసింది. వాస్తవానికి ఈ నిధులను నవంబర్ 10న విడుదల చేయాల్సి ఉండగా.. ఐదు రోజుల ముందుగానే అంటే నవంబర్ 5న రాష్ట్రాల ఖాతాల్లో జమ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది.పన్నుల వాటా నిధుల్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ.19,208 కోట్లు కేటాయించారు. బిహార్‌కు రూ.10,845 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.8,010 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.7,866 కోట్లు, మహారాష్ట్రకు రూ.7,022 కోట్లు, రాజస్థాన్‌కు రూ.6,460 కోట్లు కేటాయించారు. అత్యల్పంగా సిక్కింకు రూ.365 కోట్లు విడుదల చేసింది కేంద్ర ప్రభుత్వం.అక్టోబర్ 31న కూడా కేంద్ర ప్రభుత్వం.. అదనపు పన్నుల వాటా కింద మరో రూ.1,09,019 కోట్లను విడుదల చేసింది. దీంతో కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే రాష్ట్రాలకు మొత్తం రూ.2,18,038 కోట్ల నిధులు అందాయి. ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఇది రెండో అదనపు పన్నుల వాటా విడుదల.కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు 41 శాతం వాటా లభిస్తుంది. ఆ మొత్తాన్ని ఆర్థిక సంవత్సరంలో 14 విడతలుగా రాష్ట్రాలకు కేంద్రం పంపిణీ చేస్తుంది. ముందస్తుగా నిధులు విడుదల చేయడం ద్వారా రాష్ట్రాలు మూలధన వ్యయాలను పెంచడంతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు వినియోగించుకునే అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. ఇకపోతే 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పన్నుల వాటా కింద రూ.15.26 లక్షల కోట్లను కేటాయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో ఈ మొత్తం రూ.13.93 లక్షల కోట్లుగా ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

- కార్యకర్తలకు సూచించిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



చౌడాపూర్, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) : రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయాన్ని లక్ష్యంగా చేసుకుని నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపుని చ్చారు. ఈ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని బీఆర్ఎస్ యువజన నాయకుడు విస్లావత్ రమేష్ నాయక్ కలిశారు. ఈ సందర్భంగా తమ మండలంలో పార్టీ పరిస్థితి, పట్టభద్రుల ఓటర్ల నమోదు, రాబోయే ఎన్నికల ప్రచార వ్యూహాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు తోటి కార్యకర్తలతో కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రమేష్ నాయక్ రాత్రింబవళ్లు కష్టపడి పని చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులందరినీ నేరుగా కలిసి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను యువజన విభాగం తీసుకోవాలని ఆదేశించారు.మాజీ ఎమ్మెల్యే సూచనలపై రమేష్ నాయక్ స్పందిస్తూ.. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. క్షేత్రస్థాయిలో యువతను, పట్టభద్రులను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ పార్టీకి బలమైన పునాది వేస్తామని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ, వార్డులోనూ అర్హులైన ప్రతి ఒక్కరినీ కలిసి ఓటరు నమోదు పూర్తి చేయించడమే కాకుండా, ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ?యువతే పార్టీకి ప్రధాన బలమని, పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇల్లూ తిరుగుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, అభ్యర్థి భారీ మెజార్టీ విజయం కోసం కార్యకర్తలతో కలిసి శ్రమిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, విభాగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన స్పోర్ట్స్ అధికారి.



మహబూబ్‌నగర్, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
మహబూబ్‌నగర్ జిల్లాలో మరో అవినీతి అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ విభాగానికి సంబంధించి ఒక కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ. 3 లక్షల విలువైన బిల్లులను మంజూరు చేయడానికి జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ రాజేందర్ రెడ్డి లంచం డిమాండ్ చేశాడు. సదరు కాంట్రాక్టర్ ఎంతగా విజ్ఞప్తి చేసినా వినకుండా, లంచం ఇస్తేనే బిల్లులు పూర్తి చేస్తామని స్పష్టం చేశాడు. ?దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి తన బాధిని వెళ్లబోసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ, తమ సిబ్బందితో కలిసి గురువారం పక్కా ప్రణాళికతో వ్యూహం పన్నారు. ?మహబూబ్‌నగర్ పట్టణంలోని క్లాక్ టవర్ సమీపంలో ఉన్న ఒక హోటల్‌లో భోజనం ముగించిన అనంతరం, కాంట్రాక్టర్ నుండి రూ. లక్ష లంచం తీసుకుంటుండగా రాజేందర్ రెడ్డితో పాటు కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

అక్రమ ఫైనాన్స్ ముఠాలపై ఉక్కుపాదం



హైదరాబాద్, నవంబర్ 05: అక్రమ ఫైనాన్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి స్పష్టం చేశారు. అక్రమ ఫైనాన్స్, అధిక వడ్డీలు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ ఫైనాన్స్, రుణాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన నలుగురు నిందితులను ఎస్ఓటీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, 12 మొబైల్ 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీ చెక్కులు, రెండు సేల్ డీడ్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.అలాగే రూ.47,690 నగదు, రెండు పట్టాదా రు పాస్ పుస్తకాలు సీజ్ చేశామని వివరించారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. అక్టోబర్ 26వ తేదీన ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. తాజా అరెస్టులతో నిందితుల సంఖ్య ఏడుకి పెరిగిందని చెప్పారు.

కొల్లూర్‌లో ఘనంగా రైతు సదస్సు

- ఈపీ విద్యార్థుల ఆధ్వర్యంలో వ్యవసాయ అవగాహన కార్యక్రమం



నవాబ్‌పేట, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పాలెం అగ్రికల్చరల్ కాలేజీకి చెందిన నాల్గవ సంవత్సరం ఆర్ ఏ డబ్ల్యూ ఈ పి విద్యార్థుల ఆధ్వర్యంలో కొల్లూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతు సదస్సు అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ పరిధిలోని రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు, సాగు మెళకువలపై విద్యార్థులు సమగ్ర అవగాహన కల్పించారు. ?ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా అసోసియేట్ డీన్ డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) గోవింద్ నాయక్, టి ఆర్ వి కె కో-ఆర్డినేటర్ డాక్టర్ కల్యాణి హాజరయ్యారు. వీరితో పాటు గ్రామ సర్పంచ్ సేవ్యా నాయక్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తులసీరామ్, ఎఫ్ పి సి అధ్యక్షులు నరేందర్ రెడ్డి, బి.కె.ఎస్ అధ్యక్షులు రామ్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ధర్మేంద్ర తదితర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విద్యార్థుల ప్రయత్నాన్ని అభినందించారు.

– ప్రత్యేక ఆకర్షణగా వ్యవసాయ ఎగ్జిబిషన్...
సదస్సులో భాగంగా అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు రకాల వ్యవసాయ మోడల్స్ ఎగ్జిబిషన్ రైతులను విశేషంగా ఆకట్టుకుంది. ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, సమగ్ర సస్యరక్షణ, ఎరువుల సమర్థ వినియోగం, సాయిల్ టెస్టింగ్ (నేల పరీక్షలు) మరియు పంట దిగుబడి పెంచే మార్గాలపై విద్యార్థులు నమూనాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పంటల సాగులో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను రైతులు తెలుపగా, విద్యార్థులు సైంటిఫిక్ పద్ధతుల్లో వారి సందేహాలను నివృత్తి చేశారు. ?కార్యక్రమం ముగింపులో, సదస్సును విజయవంతం చేయడానికి సహకరించిన కొల్లూర్ గ్రామ ప్రజలకు, రైతులకు, ప్రజాప్రతినిధులకు విశేష కృషి చేసిన ఆర్ ఏ డబ్ల్యూ ఈ పి విద్యార్థులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో తీవ్ర నీటి ఎద్దడి

- తీవ్ర అవస్థలు పడుతున్న విద్యార్థులు



బషీరాబాద్, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో నీటి ఎద్దడి పరాకాష్టకు చేరింది. తాగడానికి బొట్టు నీరు లేక, నిత్యం కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థులు అల్లాడిపోతున్నారు. ప్రాథమిక అవసరాలు కూడా తీరక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. హాస్టల్‌లోని బోరు పాడై ఏడాది కావస్తున్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకున్న దాఖలాలు లేవు. కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేసినప్పటికీ, క్షేత్రస్థాయి అధికారుల అలసత్వంతో బోరు మరమ్మతులు కాగితాలకే పరిమితమయ్యాయి. హాస్టల్ ప్రాంగణంలో మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్నప్పటికీ, అందులో నుంచి చుక్క నీరు కూడా రాకపోవడం గమనార్హం. స్థానికంగా నీటి సౌకర్యం లేకపోవ డంతో విద్యార్థులు రోజూ నీటి కోసం పరుగులు తీస్తున్నారు. ఎదురుగా ఉన్న పోలీస్ స్టేషన్, పక్కనే ఉన్న ఎంఆర్సీ భవనం నుంచి బకెట్లతో నీరు తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. తాగడానికి నీళ్లు లేవు, వాడుకోవడానికి నీళ్లు లేవు.. చివరికి మూడు రోజులకోసారి స్నానం చేస్తున్నామని విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా, అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, చదువు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అధికారులు ఇప్పటికైనా తమ నిద్రమత్తు వీడి, తక్షణమే స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టాల ని, మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించి వసతిగృహంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

సమయానికి ఆర్టీసీ బస్సు నడపాలి

- డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన బిజెపి నాయకులు
- బస్సు ఆలస్యం -- క్లాసులు మిస్ అవుతున్న విద్యార్థులు.



పూడూర్, నవంబర్ 06 (తెలంగాణ డైలీ న్యూస్) :
వికారాబాద్ జిల్లా పూడూరు మండలం కంకల్ నుండి వికారాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రతిరోజూ ఆలస్యంగా రావడం వల్ల పరిగి, వికారాబాద్, చేవెళ్ల ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించి బస్సును సమయానికి నడపాలని కోరుతూ బిజెపి నాయకులు రవీందర్ కంకల్, బిజెపి జిల్లా ఐటీ ఇన్చార్జ్ కన్నయ్యల రాజుల ఆధ్వర్యంలో వికారాబాద్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.?ఈ సందర్భంగా బిజెపి నాయకులు రవీందర్ కంకల్, కన్నయ్యల రాజు మాట్లాడుతూ...కంకల్-వికారాబాద్ రూట్‌లో ప్రయాణించే విద్యార్థులు ప్రతిరోజూ బస్సు ఆలస్యం కావడం వల్ల పాఠశాలలు, కళాశాలల్లో మొదటి పీరియడ్‌ను కోల్పోతున్నారు. చదువు దెబ్బతినడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతోంది. ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి బస్సు సమయ వేళలను సరిచేయాలి" అని డిమాండ్ చేశారు.

– ఆవేదనను వ్యక్తం చేస్తున్న విద్యార్థులు..
ప్రతిరోజూ బస్సు సమయానికి రాకపోవడంతో మేము క్లాసులకు సకాలంలో అటెండ్ కాలేకపోతున్నాం. మొదటి పీరియడ్‌లో జరిగే పాఠాలను మిస్ అవుతున్నాం" అని వాపోయారు. ?విద్యార్థుల సమస్యలపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు. ఇకపై బస్సును నిర్దిత సమయం కంటే అర గంట ముందే పంపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మన్ కీ బాత్ జిల్లా కో-కన్వీనర్ బుగ్గనల్ల విఠల్, చంగముల్ జస్వంత్, అలాగే పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ ఆలయ భూములను పరిరక్షించాలి

- ఐదు ఎకరాల భూమిలో అక్రమ కబ్జాలు, నిర్మాణాలను అడ్డుకోవాలి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, /

సిద్దిపేట పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములను పరిరక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని దేవాలయ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1340లో ఉన్న ఐదు ఎకరాల దేవస్థాన భూమిని అక్రమ కబ్జాలు, నిర్మాణాల నుంచి కాపాడాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకుడు జిల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన భూముల్లో ప్రైవే టు కార్యక్రమాలు, వ్యాపార కార్యకలాపాలకు అనుమ తులు ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యంగా దీపావళి పేరుతో ఆలయ భూమిలో



దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిం చేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కోరారు. 1995–96 పహణీ రికార్డుల్లో ఈ ఐదు ఎకరాల భూమి దేవస్థా నానికి చెందినదిగా నమోదై ఉందని, గతంలో దేవాదాయ శాఖకు సంబంధించిన రికార్డులు కూడా ఉన్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం భూమిపై వివాదాలు నెలకొన్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూమికి సంబంధించిన రెవెన్యూ, దేవాదాయ శాఖ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని కోరారు. వివాదం పరిష్కారమయ్యే వరకు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా యథాతథ స్థితిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖ నిబం ధనల ప్రకారం ఆలయ ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దీపావళి సందర్భంగా ఆలయ భూమిలో వ్యాపార దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వవ ద్దని కోరుతూ బుధవారం సిద్దిపేట ఆర్డీఓ, ఏసీపీ, అగ్నిమాపక శాఖ అధికారులకు సైతం వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పరిరక్షణ సమితి నాయకులు ఉడుత మల్లేశం, పాసికంటి సత్యం తదితరులు పాల్గొని ఆలయ భూముల పరిరక్షణకు అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల స్వచ్ఛ కార్మికులకు 11 నెలలుగా వేతనాలేవి

- పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి
- నవంబర్ 16, 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, /

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికులకు గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని స్వచ్ఛ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. వేతనాల చెల్లింపులో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. సిద్దిపేటలో గురువారం జోగు రాములు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ కార్మికుల సీఐటీయూ జిల్లా స్థాయి సమావేశానికి కాసు మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా పరిపాలనాధికారులు, కలెక్టర్‌తో చర్చించి



దసరా పండుగలోపు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా, నెల రోజులు గడిచినా ఇప్పటివరకు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో లేని వేతనాల సమస్య సిద్దిపేట జిల్లాలోనే తలెత్తడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను పరిశు భ్రంగా ఉంచడం, మరుగుదొడ్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం వంటి కీలక బాధ్యతలను స్వచ్ఛ కార్మికులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంతటి సేవలు అంది స్తున్న కార్మికులకు 11 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో నవంబర్ 16, 17, 18 తేదీల్లో సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, అక్రమ తొలగింపులను అరికట్టాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు అందించాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన స్వచ్ఛ కార్మికులు మల్లేశం, వెంకటేశం, కళావతి, రేణుక, రజిత, సమీనా, సుమలత, మణెమ్మ, కవిత, పుష్పలత, మంజుల, కనకలక్ష్మి, లావణ్య, బాలమణి, సునీత, భాగ్య, కనకయ్య, మల్లమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మంగళబస్తీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ నిర్మాణం: మాధవరం కృష్ణారావు

నవంబర్ 5(కూకట్ పల్లి): కూకట్‌పల్లి మంగళబస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాత పైప్‌లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించకూడదని, పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులూ, వాటర్ వర్క్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో గుట్టుగా గుట్కా విక్రయాలు..

- కర్ణాటక నుంచి యథేచ్ఛగా సరఫరా..
- డీలర్ల ద్వారా పెద్ద ఎత్తున రవాణా

పరిగి, నవంబర్ 06 (తెలంగాణ డైలి న్యూస్) :

నామమాత్రంగా అధికారుల తనిఖీలు.. రెచ్చిపోతున్న అక్రమార్కులు, వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో నిషేధిత గుట్కా, పాన్ మసాలా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం గుట్కా, నికోటిన్ ఆధారిత ఉత్పత్తులపై కఠిన నిషేధం విధించినప్పటికీ, అక్రమార్కులు దర్జాగా తమ దందాను కొనసాగిస్తున్నారు. సీక్రెట్ గోదాముల్లో నిల్వ చేస్తూ పల్లెలు, పట్టణాలకు తరలిస్తూ రెండు చేతులా అక్రమంగా సంపాదిస్తున్నారు.

– కర్ణాటక నుంచి డీలర్ల ద్వారా సరఫరా..

గుట్కా మాఫియాకు సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక ప్రధాన కేంద్రంగా మారింది. అక్కడి నుంచి పరిగి ప్రాంతానికి డీలర్ల ద్వారా పెద్ద ఎత్తున గుట్కా, పాన్ మసాలా సరఫరా అవుతున్నట్లు సమాచారం. డీలర్ల ద్వారా పట్టణంలోని కిరాణా, పాన్ షాపులకు ఈ నిషేధిత ఉత్పత్తులు చేరుతున్నాయి. కొందరు వ్యాపారులు ఒక మాఫియాగా ఏర్పడి ఈ అక్రమ రవాణాను ప్రధాన వృత్తిగా మార్చుకున్నారు. పట్టుబడినా, కేసులు నమోదైనా సులువుగా బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ అదే దందాను కొనసాగిస్తుండటం గమనార్హం.

– డబుల్ రేట్లతో దోపిడీ..

నిషేధం పేరు చెప్పి వ్యాపారులు గుట్కా ప్రియుల నుంచి రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. గతంలో రూ.15కు లభించే అంబర్, ఆర్ఆర్, అనార్ వంటి పొగాకు పొట్లాలు ప్రస్తుతం రూ.30కి పైగా విక్రయిస్తున్నారు. అలాగే రూ.10 ఉండే విమల్, పాన్ బహార్ వంటి పౌచ్‌లను రూ.20 నుండి రూ.30 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. సరుకు కొరత పేరుతో అధిక లాభాలు చూసుకుని అమ్ముతుండటంతో వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

– నామమాత్రంగా తనిఖీలు..

పట్టణంలోని ప్రధాన కిరాణా, పాన్ షాపుల్లో బహిరంగంగానే విక్రయాలు సాగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు కనీసం



ఆ వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడు నామమాత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తనిఖీలకు వచ్చే ముందే వ్యాపారులకు సమాచారం అందుతుండటంతో, అధికారులు వచ్చే సమయానికి షాపుల్లో ఏమీ కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు.

– బానిసవుతున్న యువత..

పట్టణానికి చదువుకోవడానికి వచ్చే విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు గుట్కా, సిగరెట్ వంటి చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. నికోటిన్ ప్రభావంతో నోటి క్యాన్సర్, ఇతర తీవ్రమైన రోగాల బారిన పడుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకవైపు ఆర్థికంగా చితికిపోతూ, మరోవైపు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ?ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున గుట్కాలు సరఫరా చేస్తున్న డీలర్ల నెట్‌వర్క్‌ను ఛేదించాలని, పరిగి ప్రాంతంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ గుట్కా దందాపై ఉక్కుపాదం మోపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా చందానగర్ లైట్‌హౌస్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు



శేరిలింగంపల్లి న్యూస్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సహకా రంతో నిర్వహిస్తున్న చందానగర్ లైట్‌హౌస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నాలుగో వార్షికో త్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుక లకు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, కమ్యూనిటీ కోఆర్డినే టర్లు, లైట్‌హౌస్ జాతీయ విస్తరణ విభాగం అధిపతి అతుల్, తెలంగాణ విస్తరణ విభాగం అధిపతి ఆకుల శ్రీనివాస్‌తో పాటు చందానగర్ లైట్‌హౌస్ బృంద సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో లైట్‌హౌస్ అందిస్తున్న నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తు న్నాయని అన్నారు. శిక్షణతో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చేప డుతున్న ఉద్యోగ అనుసంధాన కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు 1,500 మందికి పైగా యువత ఉపాధి పొందడం అభినందనీయమని పేర్కొన్నారు.యువతలో నైపుణ్యాలను పెంపొ ందించి, వారిని స్వావలంబులుగా తీర్చిదిద్దే ందుకు లైట్‌హౌస్ చేస్తున్న కృషి ప్రశంస నీయమని ఆయన అన్నారు. గత నాలుగేళ్లుగా యువత సాధికారతే లక్ష్యంగా నిరంతరం సేవలందిస్తున్న లైట్‌హౌస్ బృంద సభ్యులను ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.యువతకు నైప ుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంలో లైట్‌హౌస్ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

వ్యవసాయ భూమి వద్ద ఘర్షణ.. గైతుపై కర్రతో దాడి

- పంచాయతీ నిర్వహిస్తుండగా ఘటన.. తలకు రక్తగాయం

వేలేరు, నవంబర్, 5,

హన్మకొండ జిల్లా వేలేరు మండలం లోక్యతండ గ్రామంలో వ్యవసాయ భూమి వద్ద జరిగిన వివాదం ఘర్షణకు దారితీసింది. గ్రామానికి చెందిన మురావత్ రాజు (42), తండ్రి హరియా, తన వ్యవసాయ భూమి వద్ద పక్క భూమి యజమాని తుకారాంతో గేట్ల వద్ద జరిగిన విషయమై వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ వివాదాన్ని పరిష్కరిం చుకునేందుకు ఇద్దరు పెద్దమను షులను పిలిపించి పంచాయతీ నిర్వహిస్తు ండగా, మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచే సుకుంది. ఈ క్రమంలో తుకారాం కర్రతో రాజు తలపై కొట్టడంతో ఆయనకు రక్తగా యమైంది. దీంతో గాయపడిన రాజు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. అనంతరం ఈ ఘటనపై ఈరోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ జారీ చేసినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జవహర్ నగర్ జన సంకల్ప యాత్ర విజయోత్సవ అభినందన సభలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



నవంబర్ 5(కూకట్ పల్లి): జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపుకై మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన"జవహర్ నగర్ జన సంకల్ప యాత్ర"విజయవంతంగా ముగిసిన సందర్భంగా, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నిర్వహించిన అభినం దన సభ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమానికి హాజరై, జన సంకల్ప యాత్ర విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు.జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం ప్రజల పక్షాన చేపట్టిన ఈ మహా పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు



నవంబర్ 5(కూకట్ పల్లి): ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయ వంతం చేసి తిరిగి వచ్చిన కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులను అభినందిస్తూ గురు వారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్‌లో సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ఢిల్లీలో నిర్వహించిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజ కవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల ద్వారా తరలివెళ్లి కార్యక్ర మాన్ని విజయవంతం చేయడం అభినంద నీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జనరల్ న్యూస్

సర్వే సమయంలో ఊరెళ్లిన వారి ఓట్ల రద్దు! - డిక్లరేషన్ ఫారంపై సంతకం లేదంటూ లక్షల అర్జీలపై వేటు



హైదరాబాద్ :తల్లి మరణించడంతో ఊరికెళ్లిన ఓ కుటుంబంలో 10 ఓట్లు రద్దయ్యాయి. వివాహ వేడుక కోసం బంధువుల గ్రామానికెళ్లిన మరో కుటుంబంలోని అందరి పేర్లను ఓటర్ల జాబితా నుంచి పూర్తిగా తొలగించారు. హైదరాబాద్?లో ఎస్ ఐఆర్ ప్రక్రియలో భాగంగా నిర్దిష్ట గడువులోపు ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించలేక ఇలా ఓటు హక్కు కోల్పోయిన బాధితులు కోకొల్లలుగా దర్శనమిస్తున్నారు.ఈ లోపాలను సరిదిద్దడం కోసం అధికారులు తిరిగి ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నా, డిక్లరేషన్ ఫారానికి సంబంధించిన సమస్యల కారణంగా ఆ ప్రయత్నాలూ ఫలించడం లేదు. 'నేను మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నాను' అని డిక్లరేషన్ ఫారంపై సంతకం పెడితే, చట్టప్రకారం తప్పుచేసినట్లే అవుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేలాది ఓటు నమోదు దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నా యి.వలువురు ఓటర్ల తొలగింపు కథనాలివీభోలక్‌పూర్‌లో నివసించే సాయిబాబా కుటుంబంలో ఎస్ఐఆర్?కు ముందు 11 మంది ఓటర్లు ఉండేవి. అయితే ఓటరు సర్వే తర్వాత ఒక్కరి పేరు మాత్రమే జాబితాలో మిగిలింది. అధికారులు ఇచ్చిన ఎన్యూ మరేషన్ పత్రాల్లో వివరాలు రాసి, తిరిగి సమర్పించే సమయానికి సాయిబాబా తల్లి మరణించారు. దీంతో అతని కుటుంబమంతా నగరం నుంచి సిద్దిపేటకు వెళ్లాల్సి వచ్చింది. తిరిగొచ్చేసరికి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించే గడువు ముగిసింది. దీంతో ముసాయిదా ఓటర్ల జాబితాలో అతని కుటుంబంలోని ఓట్లన్నీ రద్దయ్యాయి.పాత రామంతాపూర్‌కు చెందిన రాజు, అతని భార్య ఓటర్ సర్వే జరిగే సమయంలో వ్యక్తిగత కారణాలతో తమ సొంతూరికి వెళ్లారు. తిరిగొచ్చిన తర్వాత ఎన్యూమరేషన్ పత్రాలను ఇచ్చేందుకు వెళ్లగా, గడువు ముగిసిందన్నారు. దీంతో వారిద్దరి ఓట్లు రద్దయ్యాయి.మలక్‌పేటలో నివసించే ఓ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబంలో 10 ఓట్లుండగా, పలు కారణాల వల్ల ఎన్యూమరేషన్ పత్రాలు తిరిగివ్వడానికి ఆలస్యమైంది. దీంతో అందరి ఓట్లు రద్దయ్యాయి."నా వయస్సు 70 ఏళ్లు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుంచి నేను ఓటు వేస్తూనే ఉన్నాను. సర్వే సమయంలో నా ఓటు రద్దయింది. దాన్ని పునరుద్ధరించుకోవ డానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. ఆధార్ కార్డును కూడా సాక్ష్యంగా అంగీకరించడం లేదు. ఇన్నాళ్లూ ఓటు వేసిన నేను, ఇంకా బతికే ఉన్నా చనిపోయిన వ్యక్తిగా పరిగణిస్తున్నట్లు ఉంది" - షేక్ మహబూబ్, భోలక్‌పూర్‌మేం తప్పు డు ధ్రువీకరణ ఎందుకివ్వాలి ఓటరు నమోదు కోసం ఫారం-6లో దరఖాస్తుదారులు తమ వివరాలు నింపి, ఫొటోను జత చేసి, చివరలో సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ ఫారంతో పాటు మరో పత్రంపైనా సంతకం చేయాల్సి ఉంటుంది. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల ఓట్ల వివరాలు నమోదు చేయాలి. లేదంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి జత చేయాలి. వీటితో పాటు "నేను తొలిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నాను" అని పేర్కొంటూ చివర్లో డిక్లరేషన్ ఫారంపై సంతకం పెట్టాలి. ఎన్యూమరేషన్ పత్రాలు తిరిగివ్వకపోవ డం, తల్లిదండ్రులు లేదా పూర్వీకుల ఓట్లతో మ్యాపింగ్ చేసుకోకపోవడం లేదా బీఎల్వోల నిర్లక్ష్యం వంటి కారణాలతో ఓటు హక్కు కోల్పోయిన బాధితులు డిక్లరేషన్ ఫారంపై సంతకం చేయడానికి అభ్యంతరం తెలుపుతున్నారు. తమ ఓట్లు రద్దు చేస్తే, తిరిగి నమోదు చేసుకోవడానికి తామెందుకు తప్పుడు ధ్రువీకరణ ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఎస్ఐఆర్‌కు ముందు హైదరాబాద్ మహానగర ఓటరు జాబితాలో 1,14,15,542 ఓటర్లుండగా, ముసాయిదా జాబితాలో ఆ సంఖ్య 71,15,441గా నమోదైంది.

సూర్యాపేటలో 150 కిలోల గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్



సూర్యాపేట, : జిల్లాలో భారీ మొత్తంలో గంజాయి లభ్యమవడం కలకలం రేపింది. 150 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకులను కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా.. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.సూర్యాపేట జిల్లాలో భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు.. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 150 కేజీల గంజాయిని తరలిస్తున్న ఐదుగురు యువకుల ముఠాపై పోలీసులు దాడి చేశారు. కాగా.. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ముగ్గురు పరారయ్యారు. ఈ మేరకు నిందితుల నుంచి 150 కిలోల గంజాయి, రెండు ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసున్నారు. రాజమండ్రి నుంచి బెంగళూరుకు గంజాయిను తరలిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా.. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ దందాతో ఎవరెవరికి సంబంధం ఉంది. ఇంత పెద్ద మొత్తంలో గంజాయి వీరికి ఎలా లభించింది అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

డిమాండ్ ఫుల్.. ధర నిల్





హాజీపూర్(మంచిర్యాల): సన్నాల సాగుతో మంచి ఆదాయం వస్తుందని ఆశించిన జిల్లా రైతులకు నిరాశే మిగులుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటచేతికి వచ్చే సమయంలో తెగుళ్ల రూపంలో కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. మరో వైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతుల అవసరాన్ని దళారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పెట్టు బడులు పెరిగి పంటకు గిట్టుబాటు ధర లభించక సన్నాల సాగు రైతులు బేజారవుతున్నారు.90 శాతం సన్నాల సాగు..మంచిర్యాల జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.45లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఇందులో దాదాపు 90శాతం విస్తీర్ణంలో రైతులు సన్నరకం వరిని సాగుచేశారు. ప్రభుత్వ సన్నధాన్యానికి ప్రోత్సాహ కాలు అందిస్తుందన్న ఆశతో ఎక్కువమంది రైతులు సన్నాలవైపు మొగ్గ చూపారు. సన్నాలకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాళుకు రూ.2460 ప్రకటించింది. దానికి రూ.500 బోనస్ ఇస్తోంది. అయితే పంట చేతి కి వచ్చే సమయంలో పరిస్థితులు తారుమార వుతున్నాయి.చివరి దశలో తెగుళ్ల దాడి..వరిపంట చివరి దశకు చేరుకున్న సమయంలో తెగుళ్లు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నా రు. పంటను కాపాడుకునేందుకు పలుమార్లు పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టు బడి

హైదరాబాద్‌లో అండాల దందా గుట్టురట్టు.. 43 మంది మహిళలకు విముక్తి

హైదరాబాద్ : హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర అండాల సేకరణ రాకెట్ బట్టబయలు నిందితుల చెర నుంచి 43 మంది మహి ళలకు విముక్తి కల్పించిన పోలీసులు ప్రధాన నిర్వాహకులతో సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు ఐవీఎఫ్, ఫెర్టిలి టీ సెంటర్లతో సంబంధాలపై లోతుగా దర్యాప్తు నకిలీ ఆధార్ కార్డులు, పత్రాలు సృష్టించి మోసాలకు పాల్పడినట్లు అనుమానం హైదరాబాద్ నగరంలో భారీ ఎత్తున సాగుతున్న అంతర్రాష్ట్ర అండాల అక్రమ సేకరణ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారి నుంచి అండాలను సేకరించి ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లకు అమ్ముకుంటున్న ముఠాను అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 43 మంది మహిళలకు విముక్తి కల్పించారు. ముఠాకు చెందిన 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. బేగంపేట్, సరూర్‌నగర్ పోలీసులు, మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. ప్రకాశ్ నగర్, బేగంపేట్, ఎర్రగడ్డ, సరూర్‌నగర్, గోపాలపురం ప్రాంతాల్లోని పలు చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి పేద మహిళలను ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పోలీసుల



విచారణలో తేలింది. ఒక్కో అండం సేకరణకు రూ.20,000 నుంచి రూ.30,000 వరకు ఇస్తామని ఆశ చూపి వారిని హైదరాబాద్‌కు రప్పిస్తున్నారు. ఇక్కడ అద్దె ఇళ్లలో ఉంచి, ఫెర్టిలిటీ సెంటర్లకు అనుసంధానం చేస్తున్నారు. అండాల సేకరణ కోసం మహిళలకు బలవంతంగా హార్మోన్ల ఇంజెక్షన్లు, మందులు ఇస్తున్నట్లు బాధితులు పోలీసులకు తెలిపారు.దాడుల సమ యంలో పోలీసులు హార్మోన్ల ఇంజెక్షన్లు, సిరంజిలు, మాత్రలతో పాటు కీలకమైన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకు న్నారు. ఈ రాకెట్ ప్రధాన నిర్వాహకుడిగా అమిత్ శర్మ (44), మహిళలను రిక్రూట్ చేసే సహ నిర్వాహకురాలిగా నిక్కత్ పర్వీన్ (31)తో పాటు ఏజెంట్లు, ఏఆర్‌టీ బ్యాంక్ మేనేజర్ సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అమిత్ శర్మ ప్రకాశ్ నగర్‌లో రూ.50,000 అద్దె చెల్లిస్తూ రెండేళ్లుగా ఈ కార్య కలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించారు.మహిళల పేరుతో నకిలీ ఆధార్ కార్డులు, అఫిడవిట్లు, అంగీకార పత్రాలు సృష్టించి ఈ దందా నడుపుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నా రు. ఈ రాకెట్ వెనుక ఉన్న ఐవీఎఫ్ సెంటర్లు, ఏఆర్‌టీ బ్యాంకుల పాత్రపై కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై బేగంపేట్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) రెగ్యులేషన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది.

బీసీ సంఘాలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్.. ఆత్మగౌరవ భవనాలకు భారీగా నిధులు

హైదరాబాద్ :

వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు



వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను 'రెడీ-టు-కన్‌స్ట్రక్ట్' పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.

సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో 'సింగిల్ విండో' విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు.

బీసీ కుల సంఘాలకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. ఈ భూములు బలహీన

కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే రైతాంగానికి తీరని నష్టం



మహబూబ్ నగర్ : ఎల్ నినో పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆరోపించారు. జిల్లాలోని నవాబ్ పేట మండలం అమ్మాపూర్ గ్రామంలో మాజీ ఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎండిన పంటలను పరిశీలించి, రైతులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలు కరువు వచ్చినా తట్టుకునే విధంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులను డిజైన్ చేసిందని వెల్లడించారు. ఇందులో భాగంగా కాళేశ్వరాన్ని నిర్మించి లక్షలాధి ఎకరాలకు నీరందించారని గుర్తు చేశారు. పంటలు వేసుకున్న రైతులకు నీరందించక, కరెంటు ఇవ్వక కాంగ్రెస్ తీరని నష్టం చేస్తుందని విమర్శించారు. ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయకపోవడం వల్లే ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నవాబ్ పేట లో వందల ఎకరాలు ఎండిపోతే కరువు మండలంగా ప్రకటించలేదని విమర్శించారు. నవాబ్ పేట, మిడ్జిల్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాత్రి 10 గంటల వరకే బాణసంచా కాల్చాలి



హైదరాబాద్: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దీపావళి పండగ సందర్భంగా బాణసంచాను రాత్రి 10 గంటల వరకే కాల్చాలని డీసీపీ చిత్తలూరి శ్రీధర్‌గౌడ్ అన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా వ్యాపారులు అనుమతి తీసుకున్న తర్వాతనే దుకాణాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.డీసీపీ: మల్కాజిగిరి జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో టపాసుల వ్యాపారం చేయాలనుకునే వ్యాపారులు ముందుగా డీసీపీ కార్యాలయం, అగ్నిమాపక శాఖ, పేలుడు నియంత్రణ విభాగాల నుంచి అనుమతి తీసుకోవాలి. నిబంధనల ప్రకారం దుకాణాల మధ్య మూడడుగుల దూరం ఉండాలి. ఎదురెదురుగా దుకాణాలను ఏర్పాటు చేయవద్దు. ఇసుకబస్తాలతోపాటు నీటి డ్రమ్ములను, మంటలను ఆర్పే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.

ఇచ్చేది రూ.70 వేలు - వసూలు చేసేది రూ.4 లక్షలు - అధిక వడ్డీ ముఠా అరెస్టు

హైదరాబాద్:అమాయకపు ప్రజల అవసరాలే వడ్డీ వ్యాపారుల ఆదాయాలుగా మారుతున్నా యి. పేదలకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి సాధారణం కంటే రెట్టింపు వడ్డీ వసూలు చేస్తూ వారి శ్రమను దోచేస్తున్నారు. అప్పు చెల్లించలేని పక్షంలో కొందరైతే ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారు. ఇలా పేదలను దోచుకుంటున్న ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. హైదరాబాద్‌లో అధిక వడ్డీల పేరుతో రుణాలిస్తూ అప్పు తీసుకున్న వారిని బెదిరింపులకు గురిచేస్తున్న అక్రమ ఫైనాన్స్ ముఠాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎస్‌వోటీ ఎల్బీనగర్ జోన్, ఎల్బీనగర్ పోలీసులు సంయుక్తంగా నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇప్పటికే ముగ్గురు అరెస్ట్ కాగా తాజా అరెస్టులతో ఈ కేసులో పట్టుబడిన వారి సంఖ్య ఏడుకు చేరింది. మరో నలుగురు పరారీలో ఉన్నారు."సోషల్ మీడియా ద్వారా వడ్డీకి అప్పు



ఇస్తామని ప్రచారం చేశారు. నగదు అత్యవసరమైన వారు గ్యాంగ్?ను సంప్రదిస్తారు. రెండు రోజుల్లోనే మీకు కావాల్సిన నగదు ఇస్తామని నమ్మబలుకుతారు. అలాగే బాధితులకు కావాల్సిన డబ్బు ఇస్తారు. లక్ష రూపాయలు అప్పు కావాలంటే కేవలం రూ.70 వేలు మాత్రమే ఇస్తారు. మిగతా రూ.30 వేలు ఇవ్వరు. ప్రామిసరీ నోట్ మాత్రం రూ.2 లక్షలకు రాయించుకున్నారు. ఆ రూ.70 వేలకు వడ్డీపై వడ్డీ, చక్రవడ్డి ఇలా పలు రకాలుగా రూ.4 లక్షలు చేస్తారు. ఆ రూ.4 లక్షలు ఇచ్చేంతవరకూ బాధితులను వేధిస్తూనే ఉంటారు" - సుమతి, మల్కాజిగిరి సీపీఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలిస్తూ ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని వేధింపులకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఓ వృద్ధ మహిళా డాక్టర్‌ను సైతం మోసగించి, ఆమెకు చెందిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. నిందితుల నుంచి రెండు కార్లు, 9 మొబైల్ ఫోన్లు, 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీ చెక్కులు, భూమికి సంబంధించిన పత్రాలు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఇప్పటివరకు ఏడుగురు బాధితులను గుర్తించగా మరో 20 మంది వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మల్కాజిగిరి సీపీ సుమతి పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది. అక్రమ ఫైనాన్స్ దందాలు, అధిక వడ్డీ వసూళ్లు, బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



రామాయణపై రాజమౌళి రివ్యూ.. ఆ హీరో అద్భుతంగా నటించాడంటూ జక్కన్న ప్రశంసలు

భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై సరికొత్తగా ఆవిష్కరించిన చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందిన ఈ సినిమా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా, టాలీవుడ్ నటి సాయిపల్లవి సీతాదేవిగా నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఈ నేపథ్యంలో సినిమాను వీక్షించిన దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. సినిమాలో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్, నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయని రాజమౌళి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భారతీయ ఇతిహాసాన్ని ఇంత భారీ స్థాయిలో తెరపైకి తీసుకురావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రతి సన్నివేశంలోనూ చిత్రబృందం పడిన కష్టం కనిపిస్తోందని ప్రశంసించారు.

ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్ నటన తనను ప్రత్యేకంగా ఆకట్టుకుందని రాజమౌళి తెలిపారు. ముఖ్యంగా వనవాస ఘట్టం ప్రారంభమైన తర్వాత రాముడి పాత్రలో రణ్‌బీర్ చూపించిన ప్రశాంతత, గంభీరత అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. పాత్రకు అవసరమైన హుందాతనాన్ని ఆయన చక్కగా ప్రదర్శించారని అభిప్రాయపడ్డారు. కేజీఎఫ్ సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యశ్.. ఈ చిత్రంలో రావణుడి పాత్రలో కనిపించారు. ఆయన తెరపై కనిపించిన ప్రతిసారీ బలమైన ప్రభావం చూపించారని రాజమౌళి ప్రశంసించారు. రావణుడి పాత్రకు కావాల్సిన భయంకరమైన రూపాన్ని, గంభీరమైన వ్యక్తిత్వాన్ని యశ్ అద్భుతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. సీతాదేవి పాత్రలో సాయిపల్లవి నటన కూడా రాజమౌళిని ఆకట్టుకుంది. సహజమైన అభినయంతో పాటు పాత్రకు అవసరమైన గౌరవం, హుందాతనాన్ని ఆమె తెరపై చూపించారని ప్రశంసించారు. రణ్‌బీర్, యశ్‌లతో పాటు సాయిపల్లవి కూడా తన పాత్రకు పూర్తి న్యాయం చేశారని అభిప్రాయపడ్డారు.సినిమాలోని ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఘట్టాలద్దారు.సినిమాలోని ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఘట్టాలు అత్యద్భుతంగా ఉన్నాయని రాజమౌళి తన స్పందనలో పేర్కొన్నారు. ముఖ్యంగా చివరి భాగంలోని సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉన్నాయని తెలిపారు. సినిమా మొత్తాన్ని ఎంతో ఆస్వాదించానని వెల్లడించారు. ఇంతటి భారీ ప్రాజెక్టును అద్భుతమైన దృశ్యరూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీతో పాటు చిత్రబృందం మొత్తానికి రాజమౌళి అభినందనలు తెలిపారు. ఆయన నుంచి వచ్చిన ప్రశంసలతో 'రామాయణ: పార్ట్ 1' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది.ఎ అత్యద్భుతంగా ఉన్నాయని రాజమౌళి తన స్పందనలో పేర్కొన్నారు. ముఖ్యంగా చివరి భాగంలోని సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉన్నాయని తెలిపారు. సినిమా మొత్తాన్ని ఎంతో ఆస్వాదించానని వెల్లడించారు. ఇంతటి భారీ ప్రాజెక్టును అద్భుతమైన దృశ్యరూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీతో పాటు చిత్రబృందం మొత్తానికి రాజమౌళి అభినందనలు తెలిపారు. ఆయన నుంచి వచ్చిన ప్రశంసలతో 'రామాయణ: పార్ట్ 1' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతూ నేషనల్ క్రష్‌గా మారిన కథానాయిక రుక్మిణి వసంత్. కన్నడ ఇండస్ట్రీ ద్వారా సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఈ బెంగుళూరు భామ, తక్కువ సమయంలోనే తన అందం, అద్భుతమైన అభినయంతో విశేష గుర్తింపు తెచ్చుకుంది. రక్షిత్ శెట్టి సరసన నటించిన 'సప్త సాగరదాచే ఎల్లో' (తెలుగులో 'సప్త సాగరాలు దాటి') చిత్రంలో ప్రియ పాత్రతో ప్రేక్షకుల మనస్సులను గెలుచుకుని సౌత్ ఇండియా మొత్తం మార్మోగిపోయే క్రేజ్ సంపాదించుకుంది.ఇటీవల కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి తెరకెక్కించిన మోస్ట్ అవైటెడ్ చిత్రం 'కాంతార చాప్టర్ 1' లో నటించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది రుక్మిణి. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి విశేష ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ వరుస భారీ ఆఫర్లతో ఫుల్ బిజీగా ఉంది. ఇప్పటికే ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'డ్రాగన్'లో నటిస్తూ టాలీవుడ్‌లో సరికొత్త సంచలనం సృష్టిస్తోంది.ఇటీవల కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి తెరకెక్కించిన మోస్ట్ అవైటెడ్ చిత్రం 'కాంతార చాప్టర్ 1' లో నటించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది రుక్మిణి. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి విశేష ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ వరుస భారీ ఆఫర్లతో ఫుల్ బిజీగా ఉంది. ఇప్పటికే ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'డ్రాగన్'లో నటిస్తూ టాలీవుడ్‌లో సరికొత్త సంచలనం సృష్టిస్తోంది.ఈ క్రమంలోనే రుక్మిణి వసంత్ ఒక ఇంటర్వ్యూలో టాలీవుడ్ స్టార్ హీరోలపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. "తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మీకు ఇష్టమైన హీరో ఎవరు? ఎవరితో కలసి జోడీ కట్టాలని ఉంది?" అని ప్రశ్నించగా.. రుక్మిణి ఏమాత్రం సందేహించకుండా తన మనసులోని మాటను బయటపెట్టారు.ఈ క్రమంలోనే రుక్మిణి వసంత్ ఒక ఇంటర్వ్యూలో టాలీవుడ్ స్టార్ హీరోలపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. "తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మీకు ఇష్టమైన హీరో ఎవరు? ఎవరితో కలసి జోడీ కట్టాలని ఉంది?" అని ప్రశ్నించగా.. రుక్మిణి ఏమాత్రం సందేహించకుండా తన మనసులోని మాటను బయటపెట్టారు.తెలుగులో తనకు న్యాచురల్ స్టార్ నాని అంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు. నాని నటన చాలా సహజంగా ఉంటుందని, ఆయన చేసే వైవిధ్యమైన పాత్రలు, పండించే భావోద్వేగాలు తనను ఎంతగానో ఆకట్టుకుంటాయని చెప్పారు. ఆయన సరసన ఒక్క సినిమాలోనైనా నటించి స్క్రీన్ షేర్ చేసుకోవాలనేది తన కోరిక అని రుక్మిణి వసంత్ తెలిపారు. ప్రస్తుతం రుక్మిణి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.తెలుగులో తనకు న్యాచురల్ స్టార్ నాని అంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు. నాని నటన చాలా సహజంగా ఉంటుందని, ఆయన చేసే వైవిధ్యమైన పాత్రలు, పండించే భావోద్వేగాలు తనను ఎంతగానో ఆకట్టుకుంటాయని చెప్పారు.

తెలుగులో ఆ హీరో అంటే పిచ్చి ఇష్టం..





రామాయణం చివర్లో హనుమాన్ ఎంట్రీ.. హనుమంతుడి సీన్ అదిరిపోయింది.

బాక్సాఫీస్ వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'రామాయణం పార్ట్ 1'. తాజాగా నవంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ గా థియేటర్లలో విడుదలైంది. డైరెక్టర్ నితీశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంపై ముందు నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయింది. ఉదయం నుంచి ఈ చిత్రానికి పాజిటివ్ టాక్ వస్తుంది. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన క్లైమాక్స్, పోస్ట్ క్రెడిట్ సీన్‌కు సంబంధించిన కీలక వివరాలు నెట్టింట లీక్ కావడంతో సోషల్ మీడియాలో ఒక్కసారిగా రచ్చ మొదలైంది.రావణుడిచే సీత అపహరణ , ఆమెను రక్షించే ప్రయత్నంలో జటాయువు తన ప్రాణాలను త్యాగం చేసి విషాదకరంగా మరణించడంతో కథ ఒక భావోద్వేగ మలుపు తీసుకుంటుంది. ఈ సంఘటనలతో తీవ్రంగా కలత చెందిన శ్రీరాముడు, సీతను రక్షించడానికి ప్రతిజ్ఞ చేస్తాడు. ఆయన సంకల్పం ఒక గొప్ప ప్రయాణానికి నాంది పలుకుతుంది, అది చివరికి రావణుడితో జరిగే ఒక మహా సంగ్రామానికి దారితీస్తుంది. సినిమా ముగింపు దశకు చేరుకుంటుండగా, ప్రధాన తారాగణం, సాంకేతిక నిపుణుల పేర్లు కనిపిస్తాయి. ఇదంతా పక్కన పెడితే అదే సమయంలో హనుమంతుడి ఎంట్రీ సీన్ చూపించారు. అందులో సన్నీ డియోల్ ముఖం చూపించలేదు.. కానీ ఆయన భారీ శారీరక రూపాన్ని అద్భుతమైన విజువల్ ద్వారా చూపించారు. దీంతో ఒక్కసారిగా రామాయణం పార్ట్ 2 పై మరింత అంచనాలు పెరిగాయి.ఈ చిత్రంలో పవర్‌ఫుల్ అంజనేయ స్వామి లేదా హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో సన్నీ డియోల్ నటిస్తున్న విషయం తెలిసిందే. సినిమా ముగింపు దశలో.. సరిగ్గా ఎండ్ క్రెడిట్స్ పడే సమయంలో హనుమంతుడి పాత్రను పరిచయం చేసే సన్నీ డియోల్ ఎంట్రీ సీన్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. బ్యాక్‌గ్రౌండ్‌లో హనుమాన్ చాలీసా మ్రోగుతుండగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా గాల్లోకి ఎగురుతూ, అమితమైన బలాన్ని ప్రదర్శించే దృశ్యం ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించేలా



భోజనం చేస్తుంటే ప్రొడక్షన్ బాయ్ వచ్చి అవమానించాడు..

టాలీవుడ్ నటుడు రాజీవ్ కనకాల తన సినీ ప్రస్థానంలోని కొన్ని ఆసక్తికరమైన, కొన్ని షాకింగ్ విషయాలను ఇటీవల పంచుకున్నారు. ముఖ్యంగా, ఆయన తన తొలిరోజు షూటింగ్‌లో ఎదుర్కొన్న అవమానకరమైన సంఘటనను, మహేష్ బాబు పోకిరి సినిమాలో అవకాశం కోల్పోయిన వైనాన్ని వెల్లడించారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ, తన నటన జీవితపు తొలిరోజున ఒక ప్రొడక్షన్ బాయ్ తనను అత్యంత అవమానకరంగా మాట్లాడినట్లు గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో, తాను చేతులు కడుక్కుంటుండగా, ఆ ప్రొడక్షన్ బాయ్ "హేయ్, బుద్ధుందా లేదా? నువ్వు ఇక్కడ కూర్చున్నావేంటి? పో ఎహే లే" అని అరిచినట్లు తెలిపారు. అప్పటికి హాస్య నటుడు ఏవిఎస్ కూడా సినీ పరిశ్రమకు కొత్త కావడంతో, ఈ సంఘటనపై ఆయన కూడా ఏమీ మాట్లాడలేకపోయారని రాజీవ్ చెప్పారు. ఈ అనుభవం నటుడిగా తన మొదటిరోజు తనకు ఎదురైన ఒక చేదు జ్ఞాపకమని వివరించారు. అంతేకాకుండా, మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాలో అజయ్ పోషించిన కీలక పాత్రకు తాను మొదట ఎంపికైనట్లు రాజీవ్ కనకాల తెలిపారు. ఈ విషయం తనకు ఇటీవల సోషల్ మీడియా ద్వారానే తెలిసిందని పేర్కొన్నారు. గతంలో తను నటించిన అమ్మాయి బాగుంది సినిమాలో తన పాత్ర మరణించినందున, పోకిరిలో మళ్ళీ అలాంటి పాత్రను చేయకూడదని మహేష్ బాబు స్వయంగా సూచించారని, దీంతో అజయ్‌కు ఆ అవకాశం



ప్రముఖ నటి రేఖ వేదవ్యాస్ ఓ కార్యక్రమంలో తన వ్యక్తిగత జీవితం, వివాహం, ప్రేమ సంబంధాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. తాను ఇప్పటికీ సింగిల్ గానే ఉన్నానని, మంచి జీవిత భాగస్వామి కోసం ఎదురుచూస్తున్నానని ఆమె వెల్లడించారు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌తో పోలుస్తూ, తామిద్దరమే సింగిల్ గా మిగిలిపోతామేమో అని సరదాగా వ్యాఖ్యానించారు. తనకు కొన్ని కోట్ల మంది అభిమానులు ఉన్నా, మంచి అబ్బాయి దొరకడం కష్టంగా మారిందని పేర్కొన్నారు.తనకు రాబోయే భర్త ఎలా ఉండాలి అనే దానిపై పెద్ద ప్లానింగ్ ఏమీ లేదని రేఖ తెలిపారు. చిన్నతనంలో వంద పాయింట్లతో కూడిన లిస్ట్ ఉండేదని, ఇప్పుడు అవేమీ లేవని అన్నారు. తన జీవిత భాగస్వామి జెన్యూన్ గా, మంచి వ్యక్తి అయి ఉండాలని, తనను ప్రేమించేవాడై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. బాహ్య సౌందర్యం లేదా ఎత్తు, రంగు వంటి విషయాలకు ప్రాధాన్యత ఇవ్వనని, అవి శాశ్వతం కావని స్పష్టం చేశారు. హార్ట్ పర్మనెంట్ అని, గుణానికే తాను విలువ ఇస్తానని అన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఐడి "ఆనందం రేఖ" అని, సీరియస్‌గా సంబంధం కోరుకునే వారు డీఎం చేయవచ్చని సరదాగా సూచించారు.

తనకు రాబోయే భర్త ఎలా ఉండాలి అనే దానిపై పెద్ద ప్లానింగ్ ఏమీ లేదని రేఖ తెలిపారు. చిన్నతనంలో వంద పాయింట్లతో కూడిన లిస్ట్ ఉండేదని, ఇప్పుడు అవేమీ లేవని అన్నారు. తన జీవిత భాగస్వామి జెన్యూన్ గా, మంచి వ్యక్తి అయి ఉండాలని, తనను ప్రేమించేవాడై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. బాహ్య సౌందర్యం లేదా ఎత్తు, రంగు వంటి విషయాలకు ప్రాధాన్యత ఇవ్వనని, అవి శాశ్వతం కావని స్పష్టం చేశారు. హార్ట్ పర్మనెంట్ అని, గుణానికే తాను విలువ ఇస్తానని అన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఐడి "ఆనందం రేఖ" అని, సీరియస్‌గా సంబంధం కోరుకునే వారు డీఎం చేయవచ్చని సరదాగా సూచించారు.(ప్రేమ అనే భావనపై తనకున్న లోతైన అవగాహనను రేఖ వేదవ్యాస్ వివరించారు. టీనేజ్ లవ్, క్రష్, ఇన్ఫాచ్యుయేషన్, అట్రాక్షన్, నిజమైన ప్రేమ మధ్య ఉన్న తేడాలను స్పష్టంగా చెప్పారు. క్రష్ : ఇది ఒక వ్యక్తిపై తాత్కాలిక ఆకర్షణ అని, తనకిష్టమైన నటుడిపై లేదా కాలేజీలో ఒక వ్యక్తిపై ఉండే సాధారణ భావన అని పేర్కొన్నారు.ఇన్ఫాచ్యుయేషన్ : ఇది క్రష్ కంటే ఒక అడుగు ముందుందని, తను నాకు బాయ్‌ఫ్రెండ్ అయితే బాగుండు అనే ఆలోచన అని తెలిపారు. అలాగే అట్రాక్షన్: ఇది చాలా ప్రమాదకరమని, ఒక వ్యక్తి నాకు కావాల్సిందే లేదంటే అది ఈగోగా మారుతుందని చెప్పారు.(ప్రేమ అనే భావనపై తనకున్న లోతైన అవగాహనను రేఖ వేదవ్యాస్ వివరించారు. టీనేజ్ లవ్, క్రష్, ఇన్ఫాచ్యుయేషన్, అట్రాక్షన్, నిజమైన ప్రేమ మధ్య ఉన్న తేడాలను స్పష్టంగా చెప్పారు. క్రష్ : ఇది ఒక వ్యక్తిపై తాత్కాలిక ఆకర్షణ అని, తనకిష్టమైన నటుడిపై లేదా కాలేజీలో ఒక వ్యక్తిపై ఉండే సాధారణ భావన అని పేర్కొన్నారు.ఇన్ఫాచ్యుయేషన్ : ఇది క్రష్ కంటే ఒక అడుగు ముందుందని, తను నాకు బాయ్‌ఫ్రెండ్ అయితే బాగుండు అనే ఆలోచన అని తెలిపారు. అలాగే అట్రాక్షన్: ఇది చాలా ప్రమాదకరమని, ఒక వ్యక్తి నాకు కావాల్సిందే లేదంటే అది ఈగోగా మారుతుందని చెప్పారు.

అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే నా ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ చేయండి

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.